క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

హుకుంపేట: ఏజెన్సీలో ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలు, మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటు విభిన్న వాతావరణంలో గిరిజన గ్రామాల్లో సీజనల్ వ్యాధులు బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అరుకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. వాతావరణంలో మార్పులు ఏర్పడి గ్రామాల్లో గిరిజనులు రోగాలు బారిన పడుతున్నారన్నారు. ఎండతీవ్రత ఉన్నప్పుడు బయటకు తిరగకుండా, కురుస్తున్న వర్షాల్లో తడవకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇళ్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రోజు కాచిన నీరు తాగాలని, వేడి ఆహారాలు తీసుకుంటూ జాగ్రత్తలు పాటించాలన్నారు. గ్రామాల్లో ఎవరికి అనారోగ్యం వచ్చిన వైద్య సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. పౌష్టిక ఆహారంతోనే తల్లీ, బిడ్డలకు మంచి ఆరోగ్యం లభిస్తుందని అరుకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం చెప్పారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు భక్తులకు అన్నసమారాధన

పెదబయలు: మోదకొండమ్మ తల్లి ఉత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సోమవారం మధ్యాహ్నం భగవాన్ సత్యసాయి సేవా సంస్థలు సీకరి సమితి ఆధ్వర్యంలో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్టు సత్యసాయి సేవ సంస్థ జిల్లా అధ్యక్షుడు గణేష్, పెదబయలు జోన్ కన్వీనర్ లకే సిర్పన్న ఆధ్వర్యంలో జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఉత్సవాలకు వచ్చిన భక్తులు అన్నదానంలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు. లకే శివలింగం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బోడకొండమ్మ విగ్రహ ప్రతిష్ట



పూజలు చేస్తున్న భక్తులు

మాకవరపాలెం : బోడకొండమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట ఘనంగా జరిగింది. మండలంలోని గిడుతూరులో ఆదివారం నూతనంగా నిర్మించిన ఆలయంలో బోడకొండమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహాన్ని ముందుగా గ్రామంలో ఊరేగించారు. అనంతరం వేదమంత్రోచ్ఛారణ నడుమ ప్రతిష్ట జరిపారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా పసలమారమ్మ తల్లి పండగ

రావికమతం : పసలమారమ్మ పండగను గుమ్మాలపాడు గ్రామంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు.అమ్మవారిని భక్తులు తెల్లవారు జామునుంచి దర్శించుకొని పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో పాడి పంటలు బాగా పండాలని, పశువులకు ఎటువంటి అనారోగ్యం రాకుండా ఉండాలని తల్లి పండగ నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న పశువులను అమ్మవారి ఆలయానికి తీసుకొచ్చి అమ్మవారి దీవెనలు ఇవ్వాలని కోరుకుంటారు. అమ్మవారికి సర్పంచ్ బంటు సన్యాసినాయుడు, ఎంపీటీసీ బంటు శ్రీను, విజయలక్ష్మి, వైస్‌సర్పంచ్ కాళింగి సన్యాసినాయుడు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఉత్సాహంగా మారథాన్



మారథాన్‌లో పాల్గొన్న క్రీడాకారులు

అచ్యుతాపురం రూరల్ : మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించేందుకు ఎంటీఆర్‌వై హిందుస్థాన్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎం.తులసీరావు ఆధ్వర్యంలో పూడిమడక తీరంలో ఆదివారం మారథాన్ నిర్వహించారు. పూడిమడక తీరం నుంచి సీతపాలెం తీరం వరకూ సుమారు 30 మంది యువతీ, యువకులు మారథాన్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తులసీరావు మాట్లాడుతూ మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలన్నారు. అనంతరం మారథాన్‌లో విజయం సాధించిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. మాస్టర్ కృష్ణ, వీఆర్ సమ్మర్ క్యాంప్ రగ్బీ కోచ్ వెంకట్, సుబ్బు, నరేష్, నిర్వాహకులు అరుణ్ కుమార్, అప్పలరాజు పాల్గొన్నారు.



కోతకు గురైన రోడ్డును చూపిస్తున్న గ్రామస్తులు





వర్షాలకు కోతకు గురైన తూరుమామిడి రోడ్డు

రహదారి పూర్తయ్యేనా?

పాడేరు రూరల్: ఏజెన్సీలో ప్రస్తుతం చాలా ప్రాంతాల్లో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో శివారు గ్రామాలకు రహదారులు నిర్మించారు. మన్యంలోని అన్ని చోట్ల రోడ్ల నిర్మాణానికి నాటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేశారు. అయితే అప్పట్లో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పనులు నిలిచిపోయాయి. అధికారంలో వచ్చిన కూటమి ప్రభుత్వం మన్య ప్రాంతంపై కన్నెత్తి చూడడం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా అల్లూరి జిల్లాలో ఒక్క ప్రాంతంలో అభివృద్ధి పని చేయలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులను వెచ్చించి గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం లేదు. దీంతో నాడు జగన్ ప్రభుత్వ పాలనలో ప్రగతి పథంలో ఉన్న జిల్లా ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో అధోగతిలో ఉంది. గ్రామాల్లో రహదారులు పెద్ద పెద్ద గోతులతో రాళ్లు లేని అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. ఇందుకు ఉదాహరణగా పాడేరు మండలం తుంపాడ గ్రామం నుంచి కుజ్జెలి పంచాయతీ రహదారి చెప్పవచ్చు.

జగన్ ప్రభుత్వంలో రోడ్డు పనులకు శ్రీకారం

మండలంలో తుంపాడ గ్రామం నుంచి కుజ్జెలి పంచాయతీ తూరుమామిడి, పనసపుట్టు, మీదుగా మోదపుట్టు వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల రోడ్డు గత వైఎస్సార్‌సీపీ హయాంలో పనులు ప్రారంభించారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పనులు నిలిచిపోయాయి. ఆ తరువాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆయా రోడ్డు పనులను అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ చేయకపోవడంతో ఈ దారి అధ్వానంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రహదారి కోతకు గురై రాళ్లు తేలడంతో రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనచోదకులు గోతుల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారని ఆందోళన చెందుతున్నారు. ఈ రహదారి సమస్య పరిష్కరించాలని పలుమార్లు ఐటీడీఏ పీవో, కలెక్టర్‌కు వినతులు ఇచ్చినా ఫలితం లేకుండా పోయిందని చెబుతున్నారు. ఈ రోడ్డు పూర్తి చేస్తే పాడేరు మండలంలోని ఎగుమోదపుట్టు, సక్కగొయి, అండిభ, మద్దిపుట్టు, కంద్రంగిపాడు, జోడిమామిడి, రింగురోడ్డు, హుకుంపేట మండలం అడుమండ, సన్యాసమ్మపాలెం తదితర గ్రామాల్లో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి రహదారి నిర్మించిన, ఈ ప్రాంత గిరిజనుల రహదారి కల సాకారం చేయాలని కోరుతున్నారు. కుజ్జెలి–మోదపుట్టు రోడ్డు సమస్యపై ఎంపీడీవో తేజరత్నం మాట్లాడుతూ రోడ్డు పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు.



రాళ్లు తేలి, కోతకు గురైన రహదారిపై వాహనచోదకుల అవస్థలు



జగనన్న ప్రభుత్వం అధికారంలో ఉంటే రహదారి పూర్తయ్యేది

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మా గ్రామ రహదారికి నిధులు మంజూరు చేశారు. పనులు ప్రారంభమయ్యాయి. ఇంతలోనే ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రహదారి పనుల గురించి పట్టించుకోవడం లేదు. జగనన్న ప్రభుత్వం అధికారంలో ఉంటే మా గ్రామ రహదారి పూర్తయ్యేది. కుజ్జెలి–మోదపుట్టు రహదారి నిర్మించాలని పలుమార్లు అధికారులకు వినతులచ్చిన నేటికీ స్పందన లేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి రహదారి సమస్య పరిష్కరించాలి.

–పెదకాపు రామరావు, తూరుమామిడి గ్రామం, పాడేరు, మండలం



రోడ్డు పూర్తి చేయండి

మా గ్రామం రోడ్డు పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్ల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం ఈ రోడ్డు నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలి. రోడ్డు సౌకర్యం లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డు పనులు పూర్తి చేసే సమయంలోనే ప్రభుత్వం మారడం.. మాకు శాపంగా మారింది. యంత్రాంగం, ఉన్నతాధికారులు స్పందించి త్వరితగతంగా రోడ్డు పూర్తి చేయాలి.

–కొర్రా బొంజుబాబు, తూరుమామిడి గ్రామం, పాడేరు మండలం

వాలీబాల్ టోర్నీ విజేత గొర్రెగూమి జట్టు



విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

అనంతగిరి(అరకులోయటౌన్): మండలంలోని లంగుపర్తి పంచాయతీ చీడివలస గ్రామంలో జరిగిన వాలీబాల్ పోటీల్లో గొర్రెగూమి జట్టు విజేతగా నిలిచింది. శ్యాముల్ స్మారక టోర్నీని సర్పంచ్ జన్ని సన్యాసిరావు, వైస్ ఎంపీపీ దూరు జయవర్ధని పాల్గొని ప్రారంభించారు. ఈ పోటీల్లో 30 జట్లు పాల్గొన్నాయి. పోటీలో విజేతగా నిలిచిన జట్టుకు ప్రథమ బహుమతి గొర్రెగూమి జట్టుకు రూ.10వేలు, ద్వితీయ బహుమతి వాకపల్లి జట్టుకు రూ. 5వేలు, చీడివలస టీమ్‌కు తృతీయ బహుమతి రూ. 3వేలు నగదు అందజేశారు. వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ అరకు నియోజకవర్గం అధ్యక్షుడు రేగబోయిన స్వామి, మండల పార్టీ అధ్యక్షుడు కొర్రా సూర్యనారాయణ, మాజీ జెడ్పీటీసీ దూరు గంగన్నదొర, నాయకులు, దైవసేవకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రైల్‌రోకోకు ఎటువంటి అనుమతులు లేవు

అరకులోయటౌన్: ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ ఈనెల 19న రైల్‌రోకో నిర్వహించనున్నట్టు పిలుపునిచ్చారని, ఆ రైల్ రోకో కార్యక్రమానికి ఎటువంటి చట్టపరమైన పోలీసు అనుమతి లేదని అరకులోయ ఎస్ఐ గోపాలరావు తెలిపారు. ఈ చట్ట వ్యతిరేక కార్యక్రమంలో ప్రజలు ఎవ్వరూ పాల్గొనవద్దని సూచించారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యక్రమంలో పాల్గొంటే చట్టాల ప్రకారం కఠిన చర్యలు తప్పవన్నారు. రైల్‌రోకో కార్యక్రమానికి దూరంగా ఉండాలని ఎస్ఐ గోపాలరావు హెచ్చరించారు.

మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మికు పరామర్శ



మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి

పాడేరు : తల్లిని కోల్పోయి మాతృవేదనతో బాధపడుతున్న మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మిను మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి ఆదివారం పాడేరులోని ఆమె నివాసంలో పరామర్శించారు. ఈ సందర్భంగా భాగలక్ష్మి మాతృమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఆమె స్థానిక వైఎస్సార్‌సీపీ శ్రేణులతో మాట్లాడారు. సర్పంచ్ గబ్బాడ చిట్టిబాబు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు కుంతూరు నర్సింహమూర్తి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగ నాయకుడు డాక్టర్ తెడబారికి సురేష్‌కుమార్ తదితరులున్నారు.

విద్యుత్ సమస్యతో సతమతం

- ఈదురుగాలులు, వర్షాలతో నిలిచిపోతున్న సరఫరా
- అంధకారంలో గ్రామాలు

అరకులోయటౌన్: అరకులోయ మండలంలో తరచూ విద్యుత్ సమస్య వేధిస్తోంది. గాలివాన కురిస్తే విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. దీనికి కారణం సుంకరమెట్ట, చినలబుడు విద్యుత్ ఫీడర్ పరిధిలో మారుమూల గ్రామాలు ఉండటం వలన ఈ సమస్య తలెత్తుతోంది. సుంకరమెట్ట ఫీడర్ పరిధిలో మారుమూల బస్కీ, శిరగాం, బొండాం పంచాయతీ కరకవలస గ్రామాలతో పాటు మాడగడ, చొంపి, కొత్తభల్లుగుడ పంచాయతీ పరిధిలోని గ్రామాలున్నాయి. రెండో ఫీడర్ పరిధిలో చినలబుడు, పద్మాపురం, మాదల, గన్నెల, ఇరగాయి, లోతేరు పంచాయతీలున్నాయి. ఈ మారుమూల గ్రామాలు సుమారు 20 కిలోమీటర్ల దూరంలో ఉండడం వలన విద్యుత్ సమస్య ఏర్పడుతుంది. ఈదురుగాలులకు భారీ చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలపై పడడంతో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది.

మామిడిపల్లిలో ఘనంగా వీరుడుమాంబ ఒడ్డు పండగ



మామిడిపల్లిలో వీరుడు మాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు, గ్రామ పెద్దలు



వీరుడిమాంబ ఆలయానికి ఊరేగింపుగా వస్తున్న గ్రామ పెద్దలు, భక్తజనం

- భారీ ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్న భక్త జనం
- అమ్మవారిని దర్శించుకున్న జెడ్పీటీసీ సత్యం తదితర్లు
- ప్రత్యేక ఆకర్షణగా మహిళల కోలాట ప్రదర్శన

దేవరాపల్లి: మండలంలోని మామిడిపల్లిలో వీరుడుమాంబ అమ్మవారి ఒడ్డు పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక నాయకుడు చల్లా మహేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఒడ్డు పండగలో గ్రామస్తులంతా పసుపు కుంకుమలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని స్థానిక జెడ్పీటీసీ కర్రి సత్యం, సర్పంచ్ సూరినాయుడు, ఎంపీటీసీ సింహాచలంనాయుడు, ఉప సర్పంచ్ సుధాకర్, పండగ నిర్వాహకుడు చల్లా మహేష్ అమ్మవారిని దర్శించుకొన్నారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తలపై ఘటాలు పెట్టుకొని చేసిన మహిళల కోలాట ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

దేవతమ్మ ఉత్సవానికి ఏర్పాట్లు

కోటకోట: స్థానిక గవరపేటలో వెలసిన దేవతమ్మ ఉత్సవం సోమవారం ఘనంగా నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. ఈ సందర్భంగా ఉదయం సిద్దుల వేషం, పంచరంగులు, పంచ చక్రాకారంలో అందంగా ముగ్గు పెట్టడం, దాన్ని 'వేగి' ఇంటి పేరు కలిగిన కుటుంబీకులు సంప్రదాయంగా తొక్కడం, అనంతరం దేవతమ్మను శారదానదిలో నిమజ్జనోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం సంప్రదాయంగా భక్తులు తెచ్చిన చీరల అమ్మకం నిర్వహిస్తామన్నారు. విశాఖపట్నం, గాజువాక, కూర్మన్నపాలెం, అనకాపల్లి, నర్సీపట్నం తదితర ప్రాంతాల్లో స్థిరపడిన వేగి కుటుంబీకులు వచ్చి ఉత్సవంలో ఉత్సాహంగా పాల్గొంటారన్నారు. ఈ ఉత్సవంలో భాగంగా ఆదివారం మధ్యాహ్నం మేకపోతును నిద్రించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జముకుల వారి వాయిద్యాలతో అమ్మవారి పాట గానం చేస్తూ పూజలు చేసి మేకపోతును నిద్రించారు. ఎక్కువ సంఖ్యలో ప్రజలు హాజరై కార్యక్రమాన్ని ఆసక్తిగా తిలకించారు.

మోదకొండమ్మకు ఘనంగా సారె సమర్పణ



అమ్మవారి సారె ఊరేగింపులో భక్తులు

మాడుగుల: మాడుగుల మోదకొండమ్మ పండగ సందర్భంగా ఆదివారం సాయంకాలం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భారీ స్థాయిలో సారె ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి సమర్పించా రు. కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కె.భాస్కర్, ఆర్యవైశ్య సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనాదు శ్రీనివాసరావు, ఆర్యవైశ్య సంఘం జిల్లా, మండల సభ్యులతో పాటు మాడుగుల పట్టణంలో ఉన్న వాసవీక్లబ్ వనిత, సభ్యులు పాల్గొన్నారు.

హనుమజ్జయంతి ఉత్సవాలకు సన్నాహాలు

కోటకోట: మండలంలో ఈ నెల 22న హనుమజ్జయంతి ఉత్సవాలను నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా స్థానిక గవరపేటలో వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఆంజనేయస్వామి విగ్రహంతోపాటు ఆలయానికి అశోక ఫ్రెండ్స్ క్లబ్ సాంస్కృతిక పరిషత్ ఆధ్వర్యంలో అందంగా రంగులు వేసే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. స్థానిక అభయాంజనేయస్వామి ఆలయంలో స్వామికి రంగులు వేసి ముస్తాబు చేస్తున్నారు. జయంతి రోజు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, తమలపాకు, సిందూర అర్చనలు వగైరా కార్యక్రమాలను నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. పూసర్లవీధిలోని ఆంజనేయ స్వామి, కుమ్మర వీధిలోని పంచముఖి ఆంజనేయ స్వామి, సలాది వీధి, హౌసింగ్ కాలనీల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమాన్ జయంతి నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

వైభవంగా పోతురాజుస్వామి జాతర



భక్తులతో కలిసి వేడుకలో పాల్గొన్న జెడ్పీటీసీ జానకమ్మ

డుంబ్రిగుడ: మండలంలోని అరకు పంచాయతీ కేంద్రంలో ఆదివారం పోతురాజుస్వామి జాతర ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి సర్పంచ్ శారద ఏర్పాట్లను పర్యవేక్షించారు. వేడుకల్లో భాగంగా జెడ్పీటీసీ సభ్యురాలు చటారీ జానకమ్మ భక్తులతో కలిసి స్వామి వారికి పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిగింది. థింసా నృత్యాలతో మహిళలు ఉత్సాహంగా గిడిపారు. సాయంత్రం ఒడియా నాటకం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులతో పాటు జాతర ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


ఆకట్టుకున్న విద్యుత్ దీపాలంకరణ



పెదబయలులో ఏర్పాటు చేసిన విద్యుత్ లైటింగ్

పెదబయలు: మండల కేంద్రంలోని మోదకొండమ్మ తల్లి ఉత్సవాల సందర్భంగా వర్తక సంఘం ఆధ్వర్యంలో భారీగా విద్యుత్ అలంకరణ చేశారు. పెదబయలు కేజీబీవీ సమీపం నుంచి స్టేట్ బ్యాంకు వరకు విద్యుత్ లైటింగ్ ఏర్పాటు చేశారు. అలాగే గ్రామ పంచాయతీ కార్యాలయం వీధి, పలు వీధుల్లో లైటింగ్ ఏర్పాటు చేశారు. పెదబయలు వారపు సంత మార్కెట్ స్థలంలో జెయింట్ వీల్ ఏర్పాటు చేశారు. దీంతో ఈ ప్రాంతం అంతా విద్యుత్ కాంతులతో మెరిసిపోతుంది.

కాలీఫ్లవర్ సాగు..ఆదాయం బాగు



ములగపూడిలో సాగు చేస్తున్న కాలీఫ్లవర్ తోట



తోటలో ఏపుగా పెరిగిన కాలీఫ్లవర్

- తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందుతున్న రైతులు
- ఒకప్పుడు ఏజెన్సీకే పరిమితమైన కాలిఫ్లవర్ సాగు
- నేడు మైదానంలో విస్తారంగా పంట

నాతవరం: ఒకప్పుడు ఏజెన్సీ ప్రాంతాల్లో సాగు చేసే కాలిఫ్లవర్ పంట ఇప్పుడు మైదానం ప్రాంతాల్లో రైతులు విస్తారంగా సాగు చేస్తున్నారు. ఇతర వ్యవసాయ పంటలతో పోల్చుకుంటే ప్రస్తుతం కాలిఫ్లవర్ సాగు ద్వారా రైతులు అధిక ఆదాయం పొందుతున్నారు.

మండలంలో ములగపూడి, బెన్నవరం మాధవనగం గ్రామాల్లో వ్యవసాయ బోర్ల సాయంతో సాగు చేస్తున్నారు. మండలానికి సరిహద్దు గ్రామాలైన నర్సీపట్నం మండలం శివారు ప్రాంతమైన మెట్టపాలెం, కసిరెడ్డిపాలెం, అప్పన్నపాలెం గ్రామాల్లో కాయగూరలతో పాటు కాలిఫ్లవర్ పంటలు సాగు చేస్తున్నారు. రెండేళ్లుగా ఇక్కడ రైతులు కాలిఫ్లవర్ పంట సాగు చేస్తున్నారు. ప్రభుత్వం రాయితీపై వ్యవసాయ బోర్ల ఏర్పాటు చేయడం, 9 గంటల పాటు వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరా చేయడంతో కాలిఫ్లవర్ తోటలు సాగుకు అన్ని విధాలుగా బాగుంటుంది.

ఒక ఎకరంలో వేసిన కాలిఫ్లవర్ పంట ద్వారా మార్కెట్లో రేట్లు గిరాకీని బట్టి ఏడాదికి లక్ష రూపాయలు వస్తుందని రైతులు చెబుతున్నారు. పెట్టుబడి కష్టపడే రైతులకు అయితే కేవలం రూ.20వేలు ఖర్చు అవుతుందని లేకుంటే అదనంగా మరో రూ. 10వేలు ఖర్చు అవుతుందన్నారు. ఇతర వ్యవసాయ పంటలతో పోల్చుకుంటే పెట్టుబడి తక్కువ అధిక అదాయం వస్తుందంటున్నారు. దీంతో ఈ ఏడాది ఆయా గ్రామాల్లో పలువురు రైతులు కాలిఫ్లవర్ సాగుపై దృష్టి సారించారు.

సాగునీటి కాలువ మరమ్మతులకు నిధులు

దేవరాపల్లి : మండలంలోని రైవాడ జలాశయంకు చెందిన చానల్స్ మరమ్మతు పనుల నిమిత్తం ప్రభుత్వం రూ. 26 లక్షలు నిధులు మంజూరు చేసింది. జలాశయం దిగువన గల ఆయకట్టు భూములకు నీరందించే కాలువలు మరమ్మతుల నిమిత్తం ఈ నిధులు మంజూరు చేశారు. త్వరలోనే మరమ్మతు పనులు చేపడతామని అధికారులు తెలిపారు.